ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## చింతపల్లిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 26-4-95

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఏది మంచిదో, ఏది చెడ్డదో మనకు తెలియదు. మనకు ఎంతసేపు కొత్త దేహాలు కావాలి, కొత్త వాతావరణ కావాలి. దేహము పుడుతుంది. ఆవాతారణలో కొంత కాలము ఉంటాము. అందులో విసుగు వస్తుంది. మరల కొత్త దేహాన్ని కోరుకొంటాము. అప్పుడు కొత్త వాతావరణవస్తుంది. ఇలా జీవుని యాత్ర సాగుతుంది. అహమిక నశించేవరకు హృదయంలో ఉన్న చైతన్యము అందదు.

ఒక విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి. దారి తప్పిపోకూడదు. దారి తప్పి పోయామంటే నడక తప్పదు, గమ్యంకు వెళ్ళము. చివరకు చెమట మిగులుతుంది, కన్నీళ్ళు మిగులుతాయి. నడిచేది సరియైన మార్గము అయితే ఒక గంట ఆలస్యమైనా గమ్యంకు చేరతాము. దారి తప్పితే ఎన్నివేల మైళ్ళు నడిచినా గమ్యంరాదు.

అహమిక నాశనానికే మనసాధనను గురిపెట్టాలి. మనకు చైతన్యం అనుభవంలోనికి రాకుండా ఏ అజ్ఞానమైతే అడ్డువస్తోందో దానిని తొలగించుకోవటానికి ప్రయత్నించాలి. ఇది శాంతిగా చేయాలి, ఓర్పుగా చేయాలి.

శాంతి, ఓర్పు, కాలము ఇవి మూడూ పెద్ద డాక్టర్లు. మనస్సులో ఉన్న వేదనను, రోదనను వీరు తీసివేస్తారు. మనస్సులో ఉన్న వేదనను, రోదనను భౌతికమైన డాక్టర్లు తీయలేరు. శాంతి, ఓర్పు, కాలము వాటిని తీసివేస్తాయి. అందువలన ఇవి మూడూ గొప్ప డాక్టర్లు. ఎవరో చనిపోయారనే వార్తను భగవాన్ దగ్గరకు తీసుకొనివచ్చారు. అప్పుడు భగవాన్ మంచిదే అన్నారు. చనిపోయినవారు సుఖపడతారు. చనిపోయిన వారి గురించి బ్రతికున్న వాళ్ళు దుఃఖపడతారు. దూబరాగా తిరిగే తంటాలమారి దేహాన్ని వదలించుకొన్నవారు అదృష్టవంతులు అన్నారు భగవాన్. తిండిలో క్రమశిక్షణ ఉండదు, ఆచారములో క్రమశిక్షణ ఉండదు, వ్యవహారంలో క్రమ శిక్షణ ఉండదు. ఏ క్రమ శిక్షణ లేకుండా పెంచినటువంటి తంటాలమారి దేహాన్ని వదిలించుకొన్నారు కాబట్టి వారు అదృష్టవంతులే. చనిపోయిన వారికి ఏ దుఃఖములేదు. ఉన్నదంతా మిగిలి ఉన్న వారికే.

నిద్ర అంటే ఎవరూ భయపడరు. కాని చావు అంటే అందరూ భయపడతారు. ముందు భయంలేకుండా జీవించటం నేర్చుకొండి అని భగవాన్ చెప్పారు. భయం వలన దుఃఖము వస్తుంది, వేదనవస్తుంది. భయం అన్నింటికంటే నీచమైనది, క్షుద్రమైనది. నిద్రలోనూ మనకు శరీరము కనబడదు. చావులోనూ శరీరము

కనబడదు. కాని నిద్ర అంటే భయపడటంలేదు, చావు అంటే భయపడుతున్నాము. రేపు ఉదయం మరల ఈ దేహముతో లెగుస్తాము అనే తలంపు వలన నిద్ర అంటే మనకు భయం కలగటంలేదు. చావు తరువాత ఈ దేహం కనబడదు అని చావు అంటే భయపడుతున్నాము. నిద్రలోనూ సాధన ఏమీ సాగదు. చావు తరువాత కూడా సాధన సాగదు. కొత్త దేహమువచ్చినతరువాత సాధన చేయవలసిందే కాని నిద్రలో సాధన ఎలాకుదరదో చనిపోయినతరువాత కూడా సాధనకుదరదు, అందువలన కాలమును సద్వినియోగం చేసుకోండి.)

మనం ఇక్కడ కూర్చొని ప్రశాంతముగా ఆలోచించుకోవలసినది ఏమిటి అంటే మనం నిజంగా ఆత్మను తెలుసుకొనే మార్గములో ఉన్నామా. లేదా. అనేది ఆలోచించుకోవాలి. ఆమార్గంలో ఉంటే విషయం తెలుస్తుంది. ఆ మార్గములో ప్రవేశించామా, లేదా అనేది చూసుకోవాలి. దారి తప్పితే ఎవరూ ఏమీ సహాయం చేయలేరు. ఫలితం దక్కదు. శ్రమ మిగులుతుంది. మనస్సు బాగుపడటంకోసం, మనస్సు శుద్ధి అవ్వటం కోసం. మనస్సులోని గుణాల వేగము తగ్గటం కోసం పూజలు. జపాలు పెట్టారు. పూజలు, జపాలు చేసినంత మాత్రముచేత జ్ఞాని అవ్వడు.

జ్ఞాని అంటే బ్రహ్మాను భవంను పొందినవాడు. ఎవడైతే ప్రకృతి గుణాల నుండి విడివడుతున్నాడో వాడికి మాత్రమే బ్రహ్మానుభవం పొందాలనే కాంక్ష కలుగుతుంది. హృదయంలో ఉన్న బ్రహ్మపదార్థము అనుభవంలోనికి వచ్చినపుడు మనం అఖండముగా ఉంటాము. ముక్కలు ముక్కలుగా ఉండము. సృష్టి అంతా వ్యాపించి ఉంటాము. మనం లేని చోటు ఉండదు. ఇల్లు విడిచిపెట్టటం, బట్టలు విడిచిపెట్టటం సన్యాసముకాదు. కోరికలు విడిచి పెట్టటం సన్యాసము.

రమణ మహర్షి, బుద్ధుడు చెప్పిన మాటలు వారు ఎక్కడ, ఎలా చెప్పినా ఆ మాటల యొక్క లక్ష్యము అంతా మోక్షమే. ఆమాటలు మోక్షంను సూచిస్తాయి గాని ప్రక్కదారులకు వెళ్ళనివ్వవు. మధ్యలో మనలను ఆపుచేయరు.

మీరు పూజలు, జపాలు, పారాయణలు చేసుకోవచ్చు. కంగారు పడవద్దు. ముందు విషయమును అర్థం చేసుకోండి. గాఢనిద్రలో మనకు దేహం గొడవ, నామము గొడవలేదు. గాఢనిద్ర నుండి మెలుకువలోనికి రాగానే నేను హృదయంలో నుండి లేచి శిరస్సులోనికి వచ్చి దేహముతోటి, నామముతోటి కలిసిపోతుంది. దేహమునకు, నామమునకు పరిమితమై ఉంటుంది. దేహముతోటి, నామముతోటి పరిమితమైన తరువాత చుట్టాలు, పరిసరాలు, స్నేహితులు, విరోధులు ఇలా మొత్తం సంసారమంతా వచ్చేస్తుంది. అప్పుడు చైతన్యమును వదలి వేస్తాము. ఏ నేను అయితే దేహముతో కలిసి ఉందో దానికి పరిమితమై అక్కడ తిరుగుతూఉంటాము. ఏదోరోజు మరణిస్తాము. నీవు చైతన్యమే. చైతన్యము నుండి నిన్ను విడదీసి ఒక రూపముతోటి, నామముతోటి తాదాప్యము పొందించేది ఈ మిధ్యానేనే. దానిని కత్తిరిస్తే సరిపోతుంది. పొయ్యిలో పుల్లలు మండుచున్నాయి అనుకోండి. మంటను నీటితో ఆర్పనక్కరలేదు. ఒకోపుల్ల, ఒకోపుల్ల బయటకు తీసివేయండి. మంట ఆరిపోతుంది. అలాగే జీవలక్షణాలు ఒక్కొక్కొటి తీసివేయండి. జీవుడు మిగలడు. జీవుడు ఆరిపోతాడు. దేహము ఏపని నిమిత్తం వచ్చిందో ఆపని చూసుకొని చచ్చిపోతుంది. దానిని మీరు ఎలాగూ ఆపుచేయలేరు కదా. అందువలన దాని గొడవ వదులు కొని చైతన్యమును పట్టుకోండి. దేహమునేను అని దేహము చెప్పటంలేదు. ఏదైతే దేహమునేను అని చెపుతోందో దానిని పట్టుకొని ఆపిశాచము

గొడవ వదిలించుకుంటే మీకు చైతన్యము అందుతుంది.

యోగాభ్యాసాలు చేసేవారికి ఆసనాలు కాని, జ్ఞానమార్గములో ఉన్నవారికి అవి ఏమీ అక్కరలేదు. సుఖాసనము చాలు అన్నారు భగవాన్. సుఖాసనము అంటే కాళ్ళు అలా ఉండాలి, చేతులు ఇలా ఉండాలి అనికాదు. మీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచటమే సుఖాసనము. మీ హృదయంలో చైతన్యము ఉంది కదా మీ మనస్సును అక్కడ ఉంచినపుడు చైతన్యము మనస్సును తినివేస్తుంది. అంటే మనస్సులో ఉన్న గుణాలను తినివేస్తుంది. అప్పుడు మనస్సు కరిగి పోతుంది. కంచములో అన్నము ఎలాగ ఉందో అలాగే ఉండాలి మా అబ్బాయి దుడ్డులాగ ఉండాలి అని కొందరు అనుకొంటారు. మనంకూడా అలాగే ఉన్నాము. మనలోని అజ్ఞానము పోకూడదు. జ్ఞానము వచ్చేయాలి.

జన్మలేని స్థితిని పొందే వరకూ ఏ మనిషిని దుఃఖము విడిచిపెట్టదు. ఇప్పుడు నాలుగు రోజులు పరిస్థితులు బాగుంటే ఇది అంతానిజం అని అనుకోవద్దు. ఇది అంతా అభూతకల్పన అంటున్నారు.

సినిమా హాలులో బొమ్మలు చూసేటప్పుడు బొమ్మలు ముట్టుకుందామని వెళ్ళి వాటిని తాకినా బొమ్మలు తగలవు. తెరేతగులుతుంది. అలాగే బ్రహ్మానుభవం కలిగిన వాడికి ఈ దేహాలు అనే బొమ్మలను చూసినపుడు లోపల ఉన్న సద్వస్తువే తగులుతూ ఉంటుంది. ఇది జ్ఞాన మార్గము. అప్పుడు రూపము, నామములమీద ఆకర్షణ కలుగదు. అజ్ఞానికి తెరమీద ఉన్న బొమ్మనిజం. జ్ఞానికి బొమ్మలకు ఆధారముగా ఉన్న తెరనిజము. బొమ్మలు ఉన్నప్పుడూ తెర ఉంటుంది. బొమ్మలులేనపుడు కూడా తెర ఉంటుంది. అలాగే నామరూపములు ఉన్నప్పుడూ బ్రహ్మం ఉంది. అవి లేనపుడు కూడా బ్రహ్మం ఉంది. అవి ఉండటం, ఊడిపోవటం తోటి బ్రహ్మంనకు సంబంధము లేదు.

శబ్దం కంటే నిశబ్దమునకు ఎక్కువ శక్తి ఉంది. మాట కంటే మౌనం నకు ఎక్కువ శక్తి ఉంది. మనస్సు అణిగితే మౌనం వస్తుంది. మనస్సు హృదయంలో అణుగుతుంది. గురువు ఆస్థానంలో ఎప్పుడైతే ఉన్నాడో వాడు నోటితో మాట్లాడకపోయినా, కళ్ళతో చూడకపోయినా మీ మనస్సు పవిత్రము అవుతుంది. గురువు సహాయము ఇట్టిది అని మీకు తెలియకుండానే మీరు పరమ పవిత్రులు అవుతారు.

మీరు పదిసార్లు కాశీ, అరుణాచలం తిరిగివస్తే ఎంతో కొంత ఫలితము ఉండవచ్చును. కాని బ్రహ్మానుభవం పొందిన వాడి దగ్గర 5 నిమిషాలు కూర్చుంటే చాలు. ఇక్కడ పొందే పవిత్రతలో మీరు జీవితం పొడుగునా యాత్రలు చేసిపొందే పవిత్రత వందోవంతు కూడా ఉండదు. వాటివలన అసలు ఫలితము ఉండదు అని చెప్పటం లేదు. జ్ఞానియొక్క స్థితి అట్టిది. సృష్టికి ఏ వస్తువు ఆధారమో అది తానై ఉన్నాడు. బ్రహ్మానుభవం కొన్ని క్షణాలు అనుభవిస్తే మీ దుఃఖకారణము ఏదైతే ఉందో అది అక్కడే అప్పుడే కాలి బూడిద అయిపోతుంది. అట్టిది బ్రహ్మానుభవం. గడ్డిమేటు ఎంత పెద్దదయినా దానిని కాల్చటానికి ఒక్క అగ్గిపుల్లచాలు. అలాగే మనమనస్సులో ఎంత మాలిన్యము ఉన్నప్పటికీ దానిని తొలగించటానికి ఒక్క జ్ఞాన కిరణంచాలు. బ్రహ్మానుభవం పొందినవాడి ఒక్కచూపుచాలు. ఆవైభవం అట్టిది. ఆత్మ గురించి మనకు తెలియనంతకాలము ఎన్ని పుస్తకాలు చదివినా, ఎన్ని గుడులు చుట్టూ తిరిగినా ఆత్మకాని దానితో కలిసి ఎన్ని జన్మలు అయినా ఇలా తిరుగు తూనే ఉంటాము. ఏ మహాత్ముడు అనుగ్రహమోవచ్చే వరకూ వడ్డుకు వచ్చే అవకాశము లేదు. పూజలు, జపాలు చేసుకొండి. వద్దని చెప్పటంలేదు. వీటివలన మనస్సు కొంత శుద్ధి అవుతుంది కాని మనస్సు

నశించదు. విచారణ అనే వాసన మనస్సుకు తగలాలి. పూజ, జపంవలన మనస్సు నశించినట్లు నటిస్తుంది. విచారణ అనే వాసన తగిలితేనే గాని అది నశించదు.

నిజంగా మీరు సుఖపడుతున్నారు అనుకోండి వెయ్యి సంవత్సరములు ఉంటారా? లేకమీరు నిజంగా కష్టపడుతున్నారు అనుకొండి వెయ్యి సంవత్సరములు ఉంటారా? ఉండరు. సుఖంవచ్చినా, కష్టము వచ్చినా ఇది ఏదీకూడా నిలవదు అని ఒక మంత్రము లాగ అనుకోండి అని ఒకస్వామీజీ చెప్పారు.

ఎవడికైతే సహనము ఉందో వాడికి నిగ్రహం ఉంటుంది. సహనం పైకి కనబడుతుంది. వాడు ఎంత కష్టపడి మనస్సును నిగ్రహిస్తే సహనం వచ్చిందో మనకు తెలియదు. మనకు లోతులు చూడటం అలవాటు లేదు. చైతన్యము యొక్క లోతులలోనికి దిగాలి. మనం చేసిన మంచి, మనం చేసిన చెడ్డ రాబోయే జన్మలలో ఎదురవుతుంది. మనంచేసినదే ఎదురవుతుంది. ఇది కర్మ సిద్ధాంతము. దేహము కూడా కర్మను బట్టి పుడుతుంది. కాలమును నేను అని భగవంతుడు చెప్పాడు. ఎవడైతే కాలమును దుర్వినియోగం చేస్తున్నాడో వాడు భగవంతుని అవమానించినట్లు లెక్క. ఒక్కక్షణం కూడా పాడుచేసుకోవద్దు. ఎవడైతే బుద్ధిమంతుడో, ఎవడైతే సత్కర్మను ఆచరిస్తున్నాడో, ఎవడికైతే నిగ్రహం ఉందో, ఎవడైతే తెలివైనవాడో అటువంటివాడు మోక్షం వద్దని అనుకొన్నా మోక్షం వచ్చివాడి పీకకు తగులుకొంటుంది అన్నారు భగవాన్. మనం మోక్షం కావాలనుకొంటున్నాము. వచ్చేదిలేదు. బుద్ధిమంతుడయినవాడు మోక్షంను కోరుకోకపోయినా మోక్షం వచ్చి వాడిని వరిస్తుంది. బుద్ధిమంతుడు పని చేసినా చేయని వాడితో సమానము. ఎందుకంటే కర్తృత్వబుద్ధి అక్కడలేదు. పుణ్యపాపములు అనే ద్వందాలను ఎప్పుడో దాటి వెళ్ళిపోయాడు.

మీ మంచిని భగవంతుడు చూస్తూనే ఉంటాడు. కాలము వచ్చినపుడు మిమ్మలను సత్కరిస్తాడు. కొండమీద కూర్చోబెడతాడు. మిమ్మలను బహూకరిస్తాడు. ఇంటిలోని వ్యక్తులు మంచివారు కాదు అనుకోండి. మనకు వారి మీద మమకారం ఉండదు. అది మంచిదే. వారుమంచి వారు అయితే మనకు వారిమీద మమకారం పెరుగుతుంది. అది ప్రమాదము. మమకారం పోతేగాని మనస్సులోపలికివెళ్ళదు. మనస్సును లోపలికి పంపటానికే అటువంటి కుటుంబములో మనలను పారవేసాడేమో? ఇది అర్థంకాక వారిని, వీరిని పట్టుకొని తిడతాము. మనం ఏ కుటుంబములో ఉన్నామో, ఏ పరిస్థితులలో ఉన్నామో ఈశ్వరునికి తెలుసుకదా. ఇంక కంగారు ఎందుకు?

నీ కన్ను లాంటి కన్ను కాదు దేవుడి కన్ను. దేవుని కంటిలో పడకుండా ఈసృష్టిలో ఏదీ జరుగదు అటువంటిది ఆయన కన్ను. ఆయనది సర్వచక్షువు. సర్వమును వీక్షించే చక్షువు. దానికి పరిమితులు లేవు, హద్దులు లేవు.

దేహము పుడుతుంది. కొంత కాలము తిరిగి మరణిస్తుంది. కాని చావు అంటే ఎలాగుంటుందో తెలియనటువంటి వస్తువు నీ హృదయంలో ఉంది. మృత్యువు యొక్క మొఖం ఎలా ఉంటుందో అది ఎప్పుడూ చూడలేదు. దానిని తెలుసుకో. అది నీ అనుభవంలోనికి వచ్చిందో దానిశాంతి, ఆనందము నీకు అందుతాయి. అనుభవం అనే మాటను గుర్తుపెట్టుకో. మిగిలిన వన్నీ పొల్లు మాటలు. ఆవస్తువు నీకు అనుభవంలోనికి వచ్చినపుడు అమరుడవుతావు, ఆనందమయుడవు అవుతావు. ఆస్థితిని పొందితే దేహము ఉన్నా ఒకటే, దేహము ఊడిపోయినా ఒకటే. దాని లక్ష్యమే ఉండదు.

నీలో ఒకడు ఉండి ప్రపంచమును చూస్తున్నాడు. నీవు ప్రపంచమును కాదు చూడవలసింది. నీలో ఉండి ప్రపంచమును చూసేవాడిని చూడు. ఇవి కాలక్షేపం కోసం చెప్పే మాటలు కాదు. సాధన చేసే వారికోసం చెప్పేమాటలు. సాధనచేసి జ్ఞానశిఖరాలకు ఎదగాలి అనుకొనేవారి కోసం చెప్పేమాటలు. నీలోపల ఉండి ప్రపంచమును చూసే వాడిని చూడు. వాడిని చూడటం ఎప్పుడైతే ప్రారంభించావో వాడు వెనుకకు తిరగటం ప్రారంభిస్తాడు. వాడిని లోపలకుగెంటు. వాడు ఉపసంహరింపబడి వాడు ఎక్కడ పుట్టాడో అక్కడకు జారుకొంటాడు. అక్కడకు జారుకొని కాలి బూడిద అవుతాడు. అప్పుడు అఖండమైన శాంతి నీకు వ్యక్తమవుతుంది.

దేవుని దగ్గర పువ్వులు పెట్టటం, గుడులు చుట్టూ తిరగటం, భోజనం మాని వేయటం. తపస్సు కాదు. నీలోపల ఉండి చూసేవాడిని వెనుకకు గెంటుకొని వెళ్ళటమే తపస్సు. వాడిని పుట్టుచోటుకు తీసుకొని వెళ్ళటమే తపస్సు. హృదయంలోనికి వాడిని తీసుకొని వెళ్ళటమే తపస్సు. హృదయంలో పరమేశ్వరుడు ఉన్నాడు. పరమాత్మ దగ్గరకు వీడిని తీసుకొని వెళితే ఆయన వీడిని మ్రింగివేస్తాడు. పరమాత్మకు వీడిని ఆహారముగా తీసుకొని వెళ్ళటమే తపస్సు.

ఎవరైనా ఒకరు ద్వేషిస్తే మీరు కంగారుపడవద్దు. అప్పుడు మీరు నిర్మలంగా ఉండగలిగితే ప్రేమించేవారిని వందమందిని పంపిస్తాడు. ఈశ్వర విలాసము అది.

ఎందుకూ పనికిరానిది ఈసృష్టిలో ఏమి ఉంది అంటే అది అహంకారము. దానిని పట్టుకొని ఈ శవంను వేసుకొని తిరగటం, అహంకారమునకు దెబ్బలు తగలకుండా చూసుకోవటం. దానిని రక్షించుకోవటం కోసం ప్రయత్నాలు చేయటం. ఇదీ మనంచేసేపని. ఎవడైతే అహంకారమును కాదనుకొంటాడో వాడు మాత్రమే నన్ను పొందుతాడు అని యేసు చెప్పాడు. ఒకమనిషి ఇద్దరకు పాలేరుతనం చెయ్యలేడు. చేస్తే దేవునికి చెయ్యి లేకపోతే సైతానుకు పాలేరుతనం చెయ్యి అని చెప్పాడు.

మోక్షం రావటానికి దేహము ఎక్కడ కూర్చుంది. అనేది ప్రధానము కాదు. మనస్సు ఎక్కడ ఉంది. ఎలాపని చేస్తోంది అనేది ప్రధానము. భౌతికంగా నీవు పెంటమీద కూర్చున్నా నీ మనస్సు దేవుని మీద ఉంటే మోక్షం వస్తుంది. భౌతికంగా నీవు పరుపులమీద కూర్చొని. నీ మనస్సు పెంటల మీద తిరుగుతూ ఉంటే మోక్షం ఎలావస్తుంది. గురువు దేహం దగ్గర కూర్చోవటం ప్రధానము కాదు. గురువు తోటి మానసిక అనుబంధము ప్రధానము. మీదేహము ఎక్కడున్నా, గురువు ఎక్కడ ఉన్నా గురువుతో మానసిక అనుబంధము కలిగి ఉండటం ప్రధానము. ఎప్పుడైనా వచ్చి చూసి వెళ్ళవచ్చును. ఎందుకంటే బ్యాటరీని చార్జ్ చేసుకోవటంకోసం. అంతేగాని గురువు దగ్గర కూర్చోనవసరము లేదు. గురువుతో మానసిక అనుబంధము వలన మీరు పవిత్రము అవుతారు. పొందవలసినది పొందేతీరుతారు.

విషయమును శ్రద్ధగావిని అర్థంచేసుకోవటానికి ప్రయత్నిస్తే బుద్ధికి సూక్ష్మత పెరుగుతుంది, ఏకాగ్రత పెరుగుతుంది. ఎప్పుడైతే బుద్ధికి సూక్ష్మతపెరిగిందో దానికి ఊరేగింపులు అక్కరలేదు. లోపలకు వెళ్ళటం మొదలు పెడుతుంది. తన యజమానికి స్వాధీనం అయిపోతుంది. మాకు గతిలేదు అని ఎవరూ అనుకోవద్దు. శరణాగతే నిజమైనగతి. ఎవడైతే శరణాగతి పొందాడో వాడికి అజ్ఞానము ఆరిపోతుంది.

పాపం ఎటువంటిదో స్నేహం అటువంటిది అన్నారు ఆచార్యులవారు. స్నేహాలు తగుమాత్రంగా

ఉండాలి. స్నేహం అతిగా ఉంటే బంధము వస్తుంది. బంధమును బట్టి పాపము చేస్తాము.

సుగుణాలన్నింటిలోకి సహనము గొప్పది. ఎన్నో సుగుణాలు ఉంటేగాని సహనం ఉండదు. సహనం లేకుండా సోదరభావము పెరుగదు. సహనం ఉన్నవాడికి వీరంతా నా సోదరులు అనిపిస్తుంది. వారు ఏమైనా పొరపాట్లు చేసినా సహనము తినేస్తుంది. సహనము లేకుండా సోదరభావము పెరుగదు, సమాన బుద్ధి కలుగదు.

సత్య వస్తువు గురించి తప్పు ఇతరుల మీద నేరాలు ఎవరైనా చెపితే అటువంటి మాటలు నాతో చెప్పకండి అనే వారు భగవాన్. నీలో తప్పు ఉంది కాబట్టి ఇతరులలో తప్పు కనబడుతోంది. నీలో లేకపోతే ఇతరులలో కనబడదు అనేవారు.

కనిపించటాలు గొడవ నీకు ఎందుకయ్యా? లోకముకనబడితే ఏముంది. కనబడకపోతే ఏముంది? దేహము ఉంటే ఎవడికి కావాలి, ఊడిపోతే ఎవడికి కావాలి? అదికాదు కావలసినది. అసలు సాక్షాత్తుగా ఉన్న వస్తువును ఎరుకలోనికి తెచ్చుకోవటమే సాక్షాత్కారము. దేహము ఎప్పుడు కనబడుతోంది. నేను అనే తలంపు వచ్చాక కనబడుతోంది. నేను అనే తలంపు రాకముందు నీ దేహమే నీకు కనబడటంలేదు. ఇతర దేహముల మాట వదిలెయ్యి. నీదేహమే నీకు కనబడటంలేదు. కాని నేను అనే తలంపు పుట్టక ముందు కూడా నీవు ఉన్నావు. ఆది నుంచి నీవు ఉన్నావు. ఆది నుండి ఉండే వస్తువు దేశ కాలముల చేత బంధించబడదు. శరీరములు మధ్యలో వచ్చాయి. నేను అనే తలంపు కూడా మధ్యలో వచ్చింది. ఇవి ఏమీ లేనపుడు అంటే అహంకారము లేనపుడు కూడా నీవు ఉన్నావు. అది సహజస్థితి, అది తురీయస్థితి, అది ఆదిస్థితి. ఆస్థితిని దేశకాలములు భంగపరచలేవు. అది అన్ని కాలములలోనూ ఉంది, అన్నిచోట్ల ఉంది.

రోగం వచ్చింది అనుకోండి. దానిని తగ్గించు కొంటాము. రోగము తగ్గిపోయాక ఆరోగము లేనపుడు మీరు ఎలా ఉన్నారో అలా అవుతారు. నేను అనే తలంపుకూడా ఒక రోగము. దీనిని విచారణ ద్వారా పోగొట్టుకుంటే మీరు పోరు. నేను అనే తలంపు లేనపుడు మీరు ఎలా ఉన్నారో అలా అవుతారు. అట్టిస్థితిని పొందండి. మీరు వచ్చిన పని అదే అని చెపుతున్నారు భగవాన్.

జ్ఞానియొక్క మౌన ప్రవాహమును అందుకొనేవారికి మాటలతో పనిలేదు. మౌన ప్రవాహము అందుకోలేని వారికి నాలుగు మాటలు చెప్పాలి. మౌనంకూడా ఒక భాష. పవిత్రులు, ఉత్తమోత్తములు ఈ మౌన భాషను అందుకొని ఎగిరి వెళ్ళిపోతారు. వారికి మాటతో పనిలేదు. మౌనభాషను అందుకొని పొందవలసినది ఏదో పొంది వచ్చిన జాడ తెలియకుండా వెళ్ళిపోతారు.

అన్నం తినేటప్పుడు కొద్దిగా నెయ్యి కలిపితే ఆ ముద్ద Soft గా దిగుతుంది. అలాగే మీ ధ్యానంలో కొద్దిగా ప్రేమ కలిపితే అది బాగా సాగుతుంది. లేక పోతే సున్నా అని చెప్పారు. ఏవస్తువును ధ్యానిస్తున్నారో దానిమీద ప్రేమ ఉంటే ధ్యానం బాగా సాగుతుంది. ప్రేమ లేని ధ్యానము సాగదు. భగవాన్ కొద్దిగా ఆలోచించమని చెపుతున్నారు. నేను చెప్పాను అని చేయటంకాదు కొద్దిగా ఆలోచించండి, దీనికి అనుకరణపనికిరాదు అని చెపుతున్నారు. అనుకరణ ఉన్న వారికి ఈ Subject అర్థంకాదు. ఆలోచన సరిగా లేనపుడు పొరపాట్లు చేస్తాము. అందువలన కొద్దిగా ఆలోచించండి.